తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిసిన మినీ అంగన్‌వాడీ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

మినీ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

- మార్చి నుంచి మళ్లీ పాత వేతనమే..
- రూ.7,800 జీతంతో తీవ్ర ఇక్కట్లు
- పెండింగ్ బిల్లులు కూడా ఇవ్వాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్

హైదరాబాద్, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా మినీ అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేతారక రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అప్‌గ్రేడ్ వేతనాలతోపాటు పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మినీ అంగన్‌వాడీ టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు ఆదివారం తెలంగాణభవన్‌లో కేటీఆర్‌ను తెలంగాణ మినీ అంగన్‌వాడీ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కలిశారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఆడెపు వరలక్ష్మీ నేతృత్వంలో ప్రతినిధులు రేణుక, మల్లిక, శివమ్మ, లక్ష్మి, సుజాత, రోజా తదితరులు సమస్యలను కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు.

పెరిగిన పనిభారం.. తగ్గిన వేతనం

సంఘం ప్రతినిధులు వివరించిన ప్రకారం.. మారుమూల పల్లెలు, గిరిజన తండాల్లో చిన్నారులకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించేందుకు రాష్ట్రంలో 3,989 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఒక్కరే టీచర్‌గా ఉండి ఆహార పంపిణీ, పిల్లల సంరక్షణ, విద్యా కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా, బీఎల్‌వో డ్యూటీలు, సర్వేలు, పల్స్‌పోలియోవంటి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. హెల్పర్ పోస్టులు ఇప్పటికీ ఖాళీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో జనవరి నెల నుంచి ప్రధాన అంగన్‌వాడీ టీచర్లతో సమానంగా రూ.13,650 వేతనాలు చెల్లించడం ప్రారంభించారు. కానీ, మార్చి నుంచి మళ్లీ పాత వేతనం రూ.7,800 మాత్రమే అందించడంతో అసమతుల్యత నెలకొన్నది. దీనివల్ల మినీ అంగన్‌వాడీ టీచర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాల భవన కిరాయిలు, కూరగాయల బిల్లులు, ఇతర ఖర్చులు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ఆర్థిక సమస్యలు టీచర్ల జీవనంపై ప్రభావం చూపుతున్నాయి.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

ఆ సంఘం ప్రతినిధుల సమస్యలు విన్న కేటీఆర్.. అంగన్‌వాడీ టీచర్లు, మినీ అంగన్‌వాడీ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాలను ప్రస్తావించి తగిన చర్యలు తీసుకోవడానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. సమావేశానికి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు, మాజీ మంత్రులు కూడా హాజరై సమస్యలపై చర్చించారు. మినీ అంగన్‌వాడీల అప్‌గ్రేడేషన్ ప్రక్రియ పూర్తి చేయడంతో పాటు వేతనాలు సమానంగా చెల్లించేలా చర్యలు తీసుకుంటామని కేటీఆర్ భరోసా ఇచ్చారు.

ఆరు నెలలైనా అందని బెనిఫిట్స్

- ఎదురుచూస్తున్న రిటైర్డ్ అంగన్‌వాడీ టీచర్లు
- ఖాళీల భర్తీపైనా ఊసెత్తని ప్రభుత్వం
- సర్కారు పని తీరుపై తీవ్ర అసంతృప్తి
- ఉద్యమ కార్యాచరణకు ప్రణాళికలు
- సర్కారుకు అంగన్‌వాడీల హెచ్చరిక

హైదరాబాద్, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలు నీరుగారుతున్నాయి. వాటిని సర్కారు విస్మరించడంతో అక్కడ పని చేస్తున్న టీచర్లు, వర్కర్ల సంక్షేమం అటకెక్కింది. అంగన్‌వాడీ కేంద్రాలలో పని చేసిన టీచర్లు, ఆయాలు ఉద్యోగ విరమణ చెంది ఆరు నెలలైంది. ఇంతవరకు వారికి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వడం లేదని వారంతా తీవ్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను తెలంగాణ అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్ల సంఘం నాయకులు ఈ విషయంపై పలుమార్లు కలిశారు. తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసినా ప్రయోజనం శూన్య మైంది. రిటైర్‌మెంట్ పొందిన అంగన్‌వాడీ టీచర్లకు రూ.2 లక్షలు, ఆయాలకు రూ.1 లక్ష చొప్పున రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇస్తామని గతంలో సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రకటించారు. కానీ ఇంతవరకు ఏ ఒక్కరికీ ఇచ్చిందిలేదు. అదేమంటే.. త్వరలోనే జీవో విడుదలవుతుందని ఆ శాఖ మంత్రి చెబుతున్నారు. ఆ జీవో ఎప్పుడు విడుదలతుందో ఎవరికీ స్పష్టత లేదు. దీంతో సర్కారు తీరుపై అంగన్‌వాడీ టీచర్లు ఆగ్రహావేశాలు వ్యక్తంచేస్తున్నారు.

ప్రభుత్వ టీచర్‌గా గుర్తించండి..

అంగన్‌వాడీ కేంద్రాలలో పని చేసే టీచర్లను ప్రాజెక్టు ఉద్యోగిగా కాకుండా.. ప్రభుత్వ ఉద్యోగిగా గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు. విద్యాశాఖ పరిధిలో కొనసాగుతున్న ప్రీ-ప్రైమరీ టీచర్లుగా తమను గుర్తించి, సర్కారు జీతం స్కేళ్లు వర్తింప చేయాలని కోరుతున్నారు. ఈ ఏడాది జూలై 1 తర్వాత చనిపోయిన టీచర్లు, ఆయాలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికైనా బేషజాలకు పోకుండా తమ డిమాండ్లు పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే సర్కారు వైఖరికి నిరసనగా తాము ఉద్యమిస్తామని వారు హెచ్చరిస్తున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో పేలిన భూ బాంబ్!

మొదటిపేజీ తరువాయి...

పెట్టారు. ఆంధ్రప్రదేశ్‌లోని మన్యం, పల్నాడు జిల్లాలకు చెందిన నేతలు ఇందులో పాత్రధారులు కాగా, తెలంగాణ కీలక మంత్రి ఇందులో సూత్రధారిగా ఒప్పందాలు జరిగినట్టు తెలిసింది. రంగారెడ్డి జిల్లా రాయదుర్గంలోని 99 ఎకరాల ప్రభుత్వ భూమిని బిగ్‌షాట్‌కు విక్రయించేందుకు జరిగిన ఒప్పందాన్ని 'నమస్తే తెలంగాణ' బయటపెట్టింది. ఆదివారం (24న) 'మంత్రి కనుసన్నల్లో బిగ్ భూదందా!' శీర్షికన కథనాన్ని ప్రచురించింది. ప్రభుత్వ భూమికి ప్రైవేటు పట్టాలు పుట్టించి, అంతర్జాతీయ స్థాయిలో పేరుకున్న గుజరాత్ వ్యాపారికి విక్రయించే కుట్రను 'నమస్తే' వెలుగులోకి తెచ్చింది. ఇప్పుడీ కథనం ఇటు తెలంగాణ, అటు ఏపీలో ప్రకంపనలు రేపుతున్నది. 'నమస్తే తెలంగాణ' కథనం చదివిన పలువురు పాఠకులు ఫోన్ చేసి ఈ వ్యవహారానికి సంబంధించి తమ వదనున్న సమాచారాన్ని, అందుకు సంబంధించిన డాక్యుమెంట్లను అందించారు. పాఠకులు పెట్టిన పొగతో రాయదుర్గం కొండల నుంచి అనకొండలే బయటికి వస్తున్నాయి.

బిగ్ దందాలో ఆ భూములే కీలకం

విశ్వేశ్వర ఇన్‌ఫ్రాస్ట్రకచర్ ప్రైవేట్ లిమిటెడ్, భావన కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ పేరు మీద ఒప్పందం చేసుకున్న భూములే బిగ్ భూదంతాలో కీలకం.'భావన' పేరుపై 125 ఎకరాలకు సంబంధించిన అగ్రిమెంట్ ఉంది. ఈ రెండు సంస్థలకు ఈఆర్‌కే రావు యజమాని అని తేలింది. ఈయన మాజీ ఎంపీ భర్త అని చెప్తూ 'నమస్తే'కు పాఠకులు సమాచారం ఇచ్చారు. పైన చెప్పిన రెండూ బోగస్ సంస్థలే నని 2014లో అప్పటి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం చంపాలాల్ తేల్చిచెప్పారు. భావన సొసైటీ సేల్‌డీడ్ దస్తావేజులు



IN THE COURT OF THE JOINT COLLECTOR-I, RANGA REDDY DIST

PRESENT: Sri.M.CHAMPALAL, I.A.S.

Case No.D5/3125/2013 Dated: 22

Between:

1. M/s.Visweswara Infrastructure Pvt. Limited
2. M/s. Visweswara Properties Pvt.Ltd.
3. M/s.Tejas Properties Pvt.Ltd.
4. M/s. Insana Condomeniums Pvt.Ltd.
5. M/s. Lokankara Realtors Pvt.Ltd.
6. M/s. Avyava Infrastructure Pvt.Ltd.
7. M/s. Jagadisa Realtors Pvt. Ltd. ..... Revision Pet

And

1. The Revenue Division Officer, Chevella Division, Rangareddy District.
2. The Dy.Collector &Tahsildar, Serilingampally Mandal, Rangareddy Distri t.
3. Bakshu Rao S/o. D.Ramachandra Rao,
4. Sumathi W/o. M.Keshava Rao,
5. Nageshwara Rao S/o.Ranga Rao,
6. Smt. Krishna Bai W/o.Kishan Rao,
7. MaheshwariBai W/o. Mageshwara Rao,
8. Tara Bai W/o.Balaji,
9. Venkataramana W/o. Jaganadha Rao,
10. Subbarao S/o. Nagaji Rao,
11. Subramanyam S/o. Bakshu Rao,

This is a Revision U/S 9 of the A.I. Rights in Land and Pattedar Pasbooks Act 1971 (Act 1/89) taken as suo-moto revision on the Representation filed by one Sri P.R.K.Rao, Managing Director, Visweswara

రైట్స్ ఇన్ ల్యాండ్ అండ్ పట్టాదార్ పాస్‌బుక్ యాక్ట్ 1971 (యాక్ట్1/89) ప్రకారం 22 ఫిబ్రవరి 2014లో రంగారెడ్డి జిల్లా అప్పటి జాయింట్ కలెక్టర్ ఇచ్చిన జడ్జిమెంట్ కాపీ

బోగస్ అని నిరుడు సుప్రీంకోర్టు కూడా తీర్పు చెప్పింది. విశ్వేశ్వర ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ పేరు మీద ఉన్న 23 ఎకరాల భూమిని పంజాబ్ నేషనల్ బ్యాంకులో తనఖా పెట్టి రుణం తీసుకున్నట్టు ఎఫ్ఐఆర్ నమోదు కాగా, విచారించిన సీబీఐ కోర్టు పీఆర్‌కే రావు, ఆయన భార్యకు 5 ఏళ్ల జైలు శిక్ష కూడా విధించింది.

తాజా ఎత్తుగడ

ధరణి రికార్డుల్లో సర్వే నంబర్ 83/2లోని 99.06 ఎకరాల భూమి ప్రైవేటు వ్యక్తుల పేర్లపై చూపెడుతున్నది. కోర్టు కేసుల నేపథ్యంలో ఈ భూమి మ్యుటేషన్, ఆధార్ అనుసంధానం కానట్టు రెవెన్యూ రికార్డుల్లో చూపెడుతున్నది. అప్పటి ఏపీఐఐసీ (ప్రస్తుత టీజీఐఐసీ) ఈ భూములపై కేసు వేసింది. అలాగే, టీపీసీసీ మాజీ నాయకుడి కుమార్తె ప్రైవేట్ సూట్ వేసింది. కోర్టు కేసుల నుంచి వీరిద్దరూ వైదొలగితే రెవెన్యూ రికార్డుల్లో ఉన్న రుక్నుద్దీన్, అజీజ్ ఫాతిమా, అబ్దుల్ అజీజ్‌లకు అధికారికంగా భూ యాజమాన్య హక్కులు లభిస్తాయి. రుక్నుద్దీన్ 1976లో రామస్వామికి జేపీఏ చేయగా, ఆయన 1982లో భావన కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి భూమిని విక్రయించినట్టు సేల్‌డీడ్ ఉంది. దీంతో ఆటోమేటిక్‌గా పీఆర్‌కే రావు సంస్థల మీదికి భూమి మ్యుటేషన్ అవుతుంది.

ముఖ్యనేత సోదరుడికి, మంత్రికి కలిపి 16 ఎకరాలు

ఈ వివాదంలోకి దూరిన కీలక మంత్రి, ముఖ్యనేత సోదరుడిని ఇందులో కలుపుకొని, బోగస్ కాగితాలకు చట్టబద్ధత కల్పించే బాధ్యత తీసుకున్నారని చెప్తున్నారు. 'భావన'లో ప్లాట్లు కొనుగోలు చేసిన వారిని పిలిపించి 'సెట్' చేసే పనిని ముఖ్యనేత సోదరుడికి అప్పగించినట్టు పాఠకులు ఆధారాలతో సహా సమచారం ఇచ్చారు. ఈ రెండు పనులు చేసిపెట్టినందుకు ఇద్దరూ కలిపి 16 ఎకరాల భూమి రాయించుకున్నట్టు సమాచారం. బోగస్ దస్తావేజులకు చట్టబద్ధత కల్పించే తొలి ప్రయత్నంలో భాగంగా టీజీఐఐసీ నుంచి సర్వే నంబర్ 83/2 లోని భూమి తమదికాదని ఎన్‌వోసీ(నిరభ్యంతర పత్రం) తీసుకున్నారు. అయితే, మాజీ ఎమ్మెల్యే భార్య టీజీఐఐసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించాక ఎన్‌వోసీ తీసుకుంటే ఆమె భర్తకు కూడా ఇందులో వాటా ఇవ్వాల్సి వస్తుందన్న ఉద్దేశంతో ఆమె బాధ్యతలు స్వీకరించడానికి 10 రోజుల ముందే ఎన్‌వోసీ తీసుకోవడం గమనార్హం. ఈ క్రమంలో ప్లాట్ల యజమానులను పిలిపించిన ముఖ్య నేత సోదరుడు వారి చేతిలో అంతో ఇంతో పెట్టి సేల్‌డీడ్‌లు తీసుకున్నట్టు తెలిసింది. మరోవైపు, పల్నాడు జిల్లా టీడీపీ ఎమ్మెల్యే అప్పట్లో 8 కోట్లు ఖర్చు చేసి 5 ఎకరాలు రాయించుకున్నట్టు సమాచారం. ఈ మొత్తం వ్యవహారాన్ని ఎలాంటి ఆటంకాలు లేకుండా సాఫీగా సాగేందుకు తెలంగాణకు చెందిన ఓ పోలీసు అధికారికి రెండెకరాలు రాసిచ్చారు. ఈ మొత్తం వ్యవహారంలో న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు 83/2 సర్వే నంబర్ ప్రైవేటు భూమి అంటూ అడ్వకేట్ జనరల్‌తో అఫిడవిట్ తీసుకున్నారు. అలా ఇచ్చినందుకు రెండెకరాలు ఇస్తామని చెప్పగా, ఇవ్వాలనుకుదడబ్బు రూపంలో ఇవ్వాలని ఆయన కోరడంతో రూ. 50 కోట్లకు డీల్ ఓకే అయినట్టు పాఠకుల లాగిన కూపీలో వెల్లడైంది.

డీల్ కోసం బయ్యర్‌ను తెచ్చిన మాజీ ఎంపీ

ఈ డీల్ కుదరడానికి నెల రోజుల ముందు తెలంగాణలోని కీలక వ్యక్తుల ఇండ్లలో ఈడీ సోదాలు జరిగాయి. తనిఖీల అనంతరం ఈడీ అధికారులు కొన్ని కీలక పత్రాలు పట్టుకుపోవడంతో పాటు, భారీగా నగదును పట్టుకున్నారనే ప్రచారం జరిగింది. అదే సమయంలో ఈ బిగ్ డీల్ కోసం మాజీ ఎంపీ బయ్యర్‌ను తెచ్చినట్టు తెలిసింది. మన్యం జిల్లాలో బాక్సైజ్ ఖనిజాల వెలికితీత ప్రాజెక్టు పనులు చేపట్టిన సమయంలో బిగ్‌షాట్‌కు, మాజీ ఎంపీకి మధ్య పరిచయం అయినట్టు తెలిసింది. ఆ పరిచయంలోనే ఆయనను హైదరాబాద్‌కు రప్పించి, ప్రముఖ హోటల్‌లో కూర్చోబెట్టి రాయదుర్గం భూముల కొనుగోలుకు ఒప్పించినట్టు సమాచారం.

గృహనిర్బంధంలో రాజు భార్య భాగ్యలక్ష్మి

మహిళను నిర్బంధించిన దాయాదులు

రఘునాథపల్లి, నవంబర్ 24 : భూ సమస్యలతో ఓ మహిళను దాయాదులు ఇంట్లో బంధించిన ఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కోమల్ల గ్రామంలో ఆదివారం చోటుచేసుకున్నది. బాధితురాలి కథనం ప్రకారం.. కొమల్లకు చెందిన పేరబోయిన రాజుకు దాయాదులైన పేరబోయిన కొమురయ్యతో భూమి విషయంలో గొడవలు ఉన్నాయి. ఆదివారం రాజు వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వద్దకు వెళ్లగా, అతడి భార్య భాగ్యలక్ష్మి ఇంట్లో పనులు చేసుకుంటున్నది. ఇదే అదును భావించిన కొమురయ్య మరో ఐదుగురితో వచ్చి ఆమె ఇంట్లోఉండగానే ఇరువైపులా ఉన్న తలుపులకు తాళాలు వేసి వెళ్లిపోయాడు. ఆందోళన చెందిన భాగ్యలక్ష్మి పోలీసులకు ఫోన్ చేయగా, వారు వచ్చి తలుపులు తీయించారు. కొమురయ్యతోపాటు ఆయనతో వచ్చిన ఐదుగురికి కౌన్సిలింగ్ ఇచ్చారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

వికారాబాద్ కలెక్టరేట్‌కు ఎన్‌హెచ్చార్సీ బృందం

కలెక్టర్, అదనపు కలెక్టర్‌తో భేటీ • లగచర్ల ఘటనపై ఆరా

వికారాబాద్, నవంబర్ 24 : లగచర్లలో జరిగిన ఘటనకు సంబంధించి పూర్తి వివరాలను సేకరించేందుకు జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యులు ఆదివారం సాయంత్రం వికారాబాద్ కలెక్టరేట్‌కు వచ్చారు. అక్కడ కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌ను కమిషన్ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ లా ముకేశ్‌తోపాటు సభ్యులు రోహిత్‌సింగ్, యతీప్రకాశ్‌శర్మ కలిశారు. లగచర్లలో కలెక్టర్‌కు ఎదురైన ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. రాత్రి అక్కడి నుంచి తిరిగి వెళ్లిపోయారు.

4 గంటల పాటు ఎన్‌హెచ్చార్సీ విచారణ

మొదటిపేజీ తరువాయి...

బృందాన్ని పంపింది. కమిషన్ డిప్యూటీ రిజిస్ట్రార్ ముఖేశ్, ఇన్‌స్పెక్టర్లు యతిప్రకాశ్ శర్మ, రోహిత్‌తో కూడిన బృందం శనివారం లగచర్లలో పర్యటించింది. ఆదివారం ఉదయం సంగారెడ్డి జిల్లా కంది సెంట్రల్ జైలులో ఉన్న 19 మంది బాధిత రైతులను బృందం సభ్యులు కలిశారు. లగచర్ల ఘటన, అరెస్టులకు సంబంధించి ప్రతి ఒక్కరినీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం తమను అక్రమంగా అరెస్టు చేసిందని, పోలీసులు హింసించారని, తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు ఎన్‌హెచ్చార్సీ బృందం సభ్యులను వేడుకున్నట్టు సమాచారం. బాధిత రైతుల్లో కొందరు కన్నీరుపెడుతూ తమను అక్రమంగా అరెస్టు చేశారని తమపై బనాయించిన తప్పుడు కేసులను ఎత్తివేసి న్యాయం చేయాలని కోరినట్టు తెలిసింది. కాగా ఎన్‌హెచ్చార్సీ బృందం సభ్యులు ప్రతి బాధిత రైతు చెప్పిన వివరాలను రికార్డు చేసుకున్నట్టు సమాచారం. నాలుగు గంటల పాటు ఎన్‌హెచ్చార్సీ సభ్యులు సుదీర్ఘంగా బాధిత రైతులతో వివరాలు సేకరించారు. వారి వెంట వికారాబాద్ జిల్లా గిరిజన శాఖ అధికారులు ఉన్నారు. నేడు వికారాబాద్ జిల్లా అధికారులతో సమావేశమై లగచర్ల ఘటనపై వివరాలు సేకరించనున్నారు. కాగా కందిజైలులో ఉన్న లగచర్ల బాధితులను సోమవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ కూడా కలవనున్నది.

తిరుచానూరులో బ్రహ్మోత్సవ సందడి

26న తిరుమంజనంతో అంకురార్పణ

హైదరాబాద్, నవంబర్ 24 (నమస్తేతెలంగాణ): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు ఈనెల 28న ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఆలయంలో ఏర్పాట్లు శరవేగంగా కొనసాగుతున్నాయని టీటీడీ ఈవో జే శ్యామలరావు, జేఈవో వీరబ్రహ్మం తెలిపారు. 26న అమ్మవారి ఆలయంలో కోయిల్‌ఆళ్వార్ తిరుమంజనం జరగనుంది. అర్చకులు అమ్మవారిని సుప్రభాతంతో మేల్కొలిపి సహస్రనామార్చన, తిరుమంజనం నిర్వహిస్తారు. 27న ఆలయంలో లక్ష కుంకుమార్చన నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాలు డిసెంబర్ 6 వరకు జరగనున్నాయి.

పరిశ్రమ ఏదైనా భూసేకరణే

- రైతుల మెడపై వేలాడుతున్న కత్తి
- సీఎం ప్రకటనతో రైతుల్లో మళ్లీ గుబులు
- ఇండస్ట్రియల్ కారిడార్‌లోనూ ఫార్మా పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం
- ప్రభుత్వం బలవంతంగా ముందుకెళ్తే
- కోర్టుకెళ్లే యోచనలో అన్నదాతలు

హైదరాబాద్, నవంబర్ 24(నమస్తే తెలంగాణ): లగచర్ల ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్నది ఫార్మాసిటీ కాదని, ఇండస్ట్రియల్ కారిడార్ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనతో రైతుల్లో ఆందోళన మరింత ఎక్కువైంది. లగచర్ల ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశం కావడంతో ప్రభుత్వం వెనక్కు తగ్గుతుందని అందరూ భావించారు. అయితే, అలాంటిదేమీ లేదని సీఎం ప్రకటనతో తేటతెల్లమైంది. ఫార్మా సిటీ అయినా, ఇండస్ట్రియల్ కారిడార్ అయినా భూసేకరణ మాత్రం తప్పదని రేవంత్‌రెడ్డి స్పష్టమైన సంకేతాలిచ్చారు. ఇండస్ట్రియల్ కారిడార్‌లోనూ ఫార్మా కంపెనీలకు చోటు లభించే అవకాశం లేకపోలేదు. దీంతో రైతుల మెడపై ఇంకా కత్తి వేలాడుతూనే ఉంది. లగచర్ల ప్రాంతంలో సుమారు 1100 ఎకరాల్లో ఫార్మా విలేజ్ ఏర్పాటుకు ప్రభుత్వం భూసేకరణ చేపట్టిన విషయం విదితమే. దీనిపై రైతుల నుంచి వెల్లువెత్తిన ప్రతిఘటన రాష్ట్రంలో ప్రకంపనలు రేపింది. కాంగ్రెస్ అధిష్ఠానానికి బాధితుల ఫిర్యాదు, జాతీయ ఎస్సీ,ఎస్టీ కమిషన్ జోక్యం తదితర పరిణామాలతో భూసేకరణపై రాష్ట్రం వెనకడుగు వేసినట్టు సర్వత్రా చర్చ జరుగుతున్న తరుణంలో సీఎం తాజా ప్రకటన తీవ్ర చర్చనీయాంశమైంది. ఫార్మా పరిశ్రమ అయినా, మరే ఇతర పరిశ్రమ అయినా రైతుల నుంచి భూసేకరణ చేయకతప్పదు. లగచర్లలో రైతులు చేస్తున్న పోరాటం కూడా భూసేకరణకు వ్యతిరేకంగానే. ఇప్పుడు ఫార్మాసిటీ పేరు మార్చి ఇండస్ట్రియల్ కారిడార్ అని చెప్పినా భూములు ఇచ్చేందుకు రైతులు సిద్ధంగా లేరు. తమకు బతుకునిచ్చే పచ్చని పంట పొలాలను దేని కోసమైనా సరే వదులుకునేది లేదని రైతు లు తెగేసి చెప్తున్నారు.

ఇండస్ట్రియల్ కారిడార్‌లోనూ ఫార్మా

ఇండస్ట్రియల్ కారిడార్‌లోనూ ఫార్మా పరిశ్రమలకు చోటు ఉంటుంది. ప్రభుత్వం ఒకవేళ అక్కడ గ్రీన్ ఇండస్ట్రియల్ కారిడార్‌ను ఏర్పాటు చేస్తే మాత్రం కాలుష్యకారక పరిశ్రమలకు చోటుండదు. అంతేతప్ప, ఫార్మా కంపెనీలను నిషేధించినట్టు కాదు. ఫార్మా కంపెనీల వల్ల భూగర్భ జలాలు తీవ్రంగా కలుషితం అవుతాయి. జీడిమెట్ల, బలానగర్ తదితర ప్రాంతాల్లోని ఫార్మా కంపెనీలు రాత్రివేళల్లో వ్యర్థ జలాలను సమీపంలోని నాలాలు, నిర్జన ప్రాంతాల్లో వదిలిపెడుతున్న వార్తలు తరచూ చర్చనీయాంశం అవుతూ ఉంటాయి. ఈ నేపథ్యంలో లగచర్ల ప్రాంతంలో ప్రతిపాదిత ఇండస్ట్రియల్ కారిడార్ పరిస్థితి ఏంటన్నది ఇప్పుడే చెప్పడం కష్టం. లగచర్ల ప్రాంతంలో సీలింగ్ భూములు ఉన్నాయని, ఇండస్ట్రియల్ కారిడార్ కోసం వాటిని ఉపయోగించుకోవాలని వామపక్ష పార్టీల నేతలు ప్రభుత్వానికి సూచిస్తున్నారు. ఇక్కడి సీలింగ్ భూముల్లో చాలా వాటిని క్రమబద్ధీకరించగా, మరికొన్నింటిపై కేసులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో సీలింగ్ భూముల్లో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు కష్టమని రెవెన్యూ వర్గాలు చెప్తున్నాయి.

ఒకసారి కోర్టుమెట్లెక్కితే అంతే

ప్రభుత్వ బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా న్యాయస్థానాల్లో కేసులు దాఖలైతే అవి తేలేందుకు సంవత్సరాలు పడుతుంది. ట్రిపుల్ ఆర్‌తోపాటు గతంలో ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల విషయంలోనూ ఇదే జరుగుతున్నది.అవి ఇప్పటికీ ప్రచారానికి నోచుకోలేదు. భూసేకరణ చట్టం ప్రకారం బలవంతంగా లాక్కునే అవకాశం లేదు. ప్రభుత్వం ఒకవేళ బలవంతంగా భూసేకరణ చేపడితే ఇబ్బందులు తప్పకపోవచ్చు.

నేడు మానుకోటలో మహాధర్నా

- దళిత, గిరిజన రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం
- హాజరుకానున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మహబూబాబాద్, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ) : లగచర్లలో దళిత, గిరిజన రైతులపై రాష్ట్ర ప్రభుత్వం అమానుషంగా వ్యవహరించిన తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఉద్యమిస్తున్నది. ఇప్పటికే లగచర్ల గిరిజన రైతులు, బాధితులతో కలిసి కేటీఆర్, గిరిజన ప్రజాప్రతినిధులు మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, మాజీ ఎంపీ మాలోత్ కవిత ఇతర ప్రజాప్రతినిధులు ఢిల్లీకి వెళ్లొచ్చారు. దళిత, గిరిజనులపై జరిగిన దాడులను అక్కడ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌తో పాటు కేంద్ర ప్రభుత్వ పెద్దలకు ఫిర్యాదు చేశారు. ఇందులో భాగంగా గిరిజన రైతులు, ప్రజలు ఎక్కువగా ఉన్న మహబూబాబాద్ జిల్లాలో సోమవారం మహాధర్నా నిర్వహించేందుకు పార్టీ అన్ని ఏర్పాట్లు చేసింది. ముందుగా ఈ నెల 21న మహాధర్నా నిర్వహించాలని పార్టీ తలపెట్టినా, కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులపై ఒత్తిడి తెచ్చి అనుమతి నిరాకరించేలా చేసింది. దీంతో జిల్లా నేతలు హైకోర్టును ఆశ్రయించి ఈనెల 25న మహాధర్నా నిర్వహించేందుకు అనుమతి పొందారు. ఈ ధర్నాకు ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానుండటంతో బీఆర్ఎస్ నాయకులు మానుకోటలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట భారీ ఏర్పాట్లు చేశారు. కేటీఆర్ సోమవారం ఉదయం 8 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి ఉదయం 10 గంటలకు మానుకోటకు చేరుకొని, లగచర్లలో రైతులపై జరిగిన దాడిపై సర్కార్‌ను నిలదీయనున్నారు. ధర్నా నిర్వహించే ప్రాంతాన్ని ఆదివారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీలు సత్యవతిరాథోడ్, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎంపీ, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, శంకర్‌నాయక్ పరిశీలించారు.

మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి. చిత్రంలో ఎమ్మెల్సీలు సత్యవతి, తక్కెళ్లపల్లి, మాజీ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, శంకర్‌నాయక్

గిరిజనులకు రేవంత్ క్షమాపణ చెప్పాలి

- లగచర్ల బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం
- నేటి మహాధర్నాను జయప్రదం చేయాలి
- మాజీ మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతి రాథోడ్, నేతలు కవిత, రెడ్యా నాయక్, శంకర్‌నాయక్ పిలుపు

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 24 : లగచర్లలో గిరిజన రైతులపై జరిగిన పాశవిక దాడికి సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం మహబూబాబాద్‌లో మహాధర్నా ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్సీలు సత్యవతి రాథోడ్, టీ రవీందర్‌రావు, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే